క్లుప్తంగా

అంకిల్ మఠ పీఠాధిపతికి తులాభారం



వీరభద్ర స్వామికి తులాభారం చేస్తున్న దంపతులు

కోసిగి: మండల కేంద్రానికి చెందిన ఎరుకుల ముకేష్, నాగలక్ష్మీ దంపతులు మొక్కు చెల్లింపులో భాగంగా కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట్ తాలూకా అంకిల్ మఠం పీఠాధిపతి వీరభద్ర స్వామిజీకి తులాభారం నిర్వహించారు. బుధవారం ఆయనను తమ స్వగృహంలో పీఠాధిపతికి పాదపూజ చేసి శాలువా, పూలమాలలు వేసి 85 కేజీల బెల్లంతో తులాభారం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బాపురం, ఆదోని, అగసనూరు, సజ్జలగుడ్డం, కోసిగికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు చేయించుకోండి



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

కోసిగి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన ప్రతి పంటలను రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయధికారి రాజు సూచించారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రస్తుతం 37వేల ఎకరాల్లో పత్తి, వేరుశనగ, జీలుగ, కంది ఆముదం, వరి తదితర పంటలు సాగుచేశారని చెప్పారు. ఇప్పటి వరకు 70 శాతం క్రాప్ బుకింగ్ చేశామన్నారు. మిగిలిన వారు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలతో ఆర్బీకేలో సంప్రదించాలని కోరారు.

టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం



వై.సీతారామిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

మంత్రాలయం : తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు వై సీతారామిరెడ్డిని విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం ఎమ్మిగనూరులోని ఆయన స్వగృహంలో పూలమాల, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, సమితి సభ్యులు వీకేసీ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా ఎదగండి



మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యార్థిగా ఎదగాలని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ పాల్గొని మాట్లాడారు. సీనియర్లు, జూనియర్లకు ఆదర్శంగా ఉంటూ చదువుల్లో రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని చెప్పారు.అన్నదమ్ముల్లా కలసిమెలిసి ఉండాలన్నారు. అధ్యాపకులు శ్రీనివాస రెడ్డి, ప్రకాశ్‌రాజ్, పరమేశ్వర్‌రెడ్డి, నరసింహు లు, సంధ్యారాణి, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

14న వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

ఆదోని సెంట్రల్: ఈనెల 14వ తేదీన స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ నరసయ్య, మండల ఇన్‌చార్జ్ పీడీ రామన్న తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ క్రీడా పోటీలకు సంబంధించిన విషయాలను సమావేశంలో చర్చిస్తామన్నారు. ఏపీ పాఠశాలలు ఏ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నాయో వంటి వివరాలను తెలియజేయాలని కోరారు.

రైతుభరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

ఆదోనిరూరల్ : కొత్తగా పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులు రైతు భరోసా కేంద్రంలో పొలానికి సంబంధించిన పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ అందించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

- వసతి గృహాల్లో విద్యార్థుల బాగోగులపై మార్గదర్శకాలు విడుదల చేసి ప్రభుత్వం
- భద్రత, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సౌకర్యాల మెరుగుకు చర్యలు
- మండల స్థాయి నుంచి జిల్లా అధికారులు పర్యవేక్షించేలా ప్రణాళిక



బాలికల సంక్షేమ వసతి గృహం



భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: సంక్షేమ వసతి గృహాల్లో నివసించే విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వసతి గృహాలు, రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో తీసుకోవలసిన జాగ్రతలపై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆదోని డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు 25 ఉన్నాయి. అయా వసతి గృహాల్లో 3,763 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహాల్లో ఐదు అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం సమగ్ర ప్రామాణిక ఆపరేటివ్ విధానాన్ని (ఎస్ఓపీ) అమలులోకి తెచ్చింది. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, ఆహారం, ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేలా ప్రణాళికలను రూపొందించింది. వసతి గృహాలను పర్యవేక్షణను మూడు భాగాలుగా విభజించింది. గ్రామ సచివాలయాల నుంచి మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షించేలా క్యాలెండర్‌ను రూపొందించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు రక్షణ, భద్రతాపరమైన చర్యలు తీసుకొనేలా అధికారులను అప్రమత్తం చేసింది. నీరుతో పాటు సురక్షితమైన ఆహారం, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. వసతి గృహ పరిసరాల్లో అవాంచనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది.

ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు..

- గ్రామస్థాయి సచివాలయాల నుంచి నుంచి రాష్ట్ర స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి.
- అధికారులు, ప్రజా ప్రతినిధులు వంటి వారు ఎవరైనా వసతి గృహాలను సందర్శిస్తే వారి వివరాలు, చర్చించిన అంశాలను రిజిష్టర్‌లో పొందుపరచాలి.
- విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందించాలి. కిచెన్, సురక్షితమైన నీరు, మరుగుదొడ్ల నిర్వహణ, మెస్ కమిటీ, పేరెంట్స్ కమిటీ వంటివి కీలకు విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- వసతి గృహాలకు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- అత్యవసర పరిస్థితిలో సంప్రదించడానికి సంబంధిత ఉద్యోగుల వివరాలను రిజిష్టర్‌లో, నోటీస్ బోర్డులో పొందుపరచాలి.
- జాబ్ చార్ట్ విధుల పట్ల అలక్ష్యం చేసే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై దృష్టి సారించాలి.
- వారాని ఒకసారైనా ఆరోగ్య సిబ్బంది స్వయంగా వసతిగృహాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి.

నిరంతర పర్యవేక్షణ అవసరం



వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. పర్యవేక్షణ లేక చాలా మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వార్డన్లు వసతి గృహాలకు దూరంగా ఉంటూ చుట్టపుగా వచ్చి పోతున్నారు. అలా కాకుండా వసతి గృహాల సమీపంలోనే ఉంటే నిరంతరం పర్యవేక్షించడానికి వీలుంటుంది. పర్యవేక్షణకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయడం సంతోషంగా ఉంది.

– శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

వసతి గృహాల పర్యవేక్షణకు చర్యలు



వసతి గృహాల పర్యవేక్షణకు తగు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం,ఆహారం, తాగునీరు వంటి వాటిని అందిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తుండాలని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మొదటగా గ్రామ స్థాయిలో సచివాలయ సిబ్బంది, మండల స్థాయిలో ఎంపీడీఓ, ఏఎస్‌డబ్ల్యూఓ, జిల్లా అధికార్లు వసతి గృహాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీనివల్ల వసతి గృహాల్లో భద్రతతో పాటు విద్యార్థుల్లో భయం పెరిగి చదువుపై దృష్టి సారించడానికి అవకాశం ఉంటుంది.

– కె. లక్ష్మీనారాయణ, ఏఎస్‌డబ్ల్యూఓ, ఆదోని

అభివృద్ధి పేరుతో దోపిడీ

ఆదోని సెంట్రల్: అభివృద్ధి పేరుతో అర్ట్స్ అండ్ సైన్సు కళాశాల యాజమాన్యం దోపిడీకి పాల్పడుతోందని అర్‌పీఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు, డివిజన్ కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. బుధవారం అర్ట్స్ అండ్ సైన్సు కళాశాల అవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కళాశాల ప్రహరీని తొలగించి షాపులు నిర్మించారని, వాటిని అద్దెకు ఇచ్చి వచ్చే సొమ్ముతో తమ జేబులను నింపుకుంటున్నారని ఆరోపించారు. దుకాణాలు నిర్మించడంతో విద్యార్థులకు క్రీడా స్థలం లేకుండా పోయిందన్నారు. వచ్చే సొమ్ముతో కళాశాలను అభివృద్ధి చేస్తామని కళాశాల యాజమాన్యం చెపుతున్నా.. విద్యార్థినిలకు సౌకర్యాలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. నాయకులు వినోద్, జయ,దాసు, విరేష్, రామలింగ, పవన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలం లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: ఆదోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని 6,292 చదరపు గజాల ఖాళీ స్థలం 15 ఏళ్లకు లీజుకు ఇవ్వడానికి టెండర్లు పిలిచినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటరామం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు టెండరు ఫారాన్ని ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు www.a prrtc.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫీసులో దాఖలు చేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేయనున్నట్లు చెప్పారు. కాగా టెండరు ప్రక్రియపై చర్చించేందుకు, సలహాలు, సూచనలకు 16వ తేదీ ఆదోని ఆర్టీసీ గ్యారేజీలో నిర్వహించనున్న ప్రీ-బిడ్ అవగాహన సదస్సుకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఆదోని డిపో మేనేజర్ 99592 25797, కర్నూలు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 9959166566 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



జుమ్మాలదిన్నెలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నాగేశప్ప

కోసిగి: విద్యార్థుల స్థాయి బట్టి సులభంగా అర్థమయ్యే పద్ధతిలో బోధించాలని ఎంఈఓ-2 నాగేశప్ప ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని జుమ్మాలదిన్నె గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేసి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే అక్కడ జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని, గడువులోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

ఆదోనిరూరల్ : ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌లతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని ఎంపీడీఓ గీతావాణి ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో హౌసింగ్ శాఖ అధికారులు, ఉపాధి సిబ్బంది, డ్వాక్రా మహిళలు, థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆదోని మండలంలో 766 ఇళ్లను థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌లు నిర్మిస్తున్నారని, ఇందులో ఆరేకల్, బసాపురం, బైచిగేరి, మదిరె, పెద్దతుంబళం గ్రామాల్లో వెంగళ్ రెడ్డి అనే కాంట్రాక్టర్, దొడ్డనగేరి, బైచిగేరి గ్రామాల్లో బి.అరుణ, నాగనాథనహళ్లి గ్రామంలో తిమ్మారెడ్డి, జి.హొసళ్లి గ్రామంలో పెద్ద హనుమంతరెడ్డి చేపడుతున్నారన్నారు. అయితే వీరి నిర్లక్ష్యం కారణంగా గడువులోపు నిర్మాణాలు చేపట్టలేదని దీంతో నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం ఈ తొమ్మిది గ్రామాల్లో 766కు గానూ బేస్‌మెంట్ లెవెల్ 111, గుంతలు తవ్వి వదిలేసినవి 25, బేస్మట్టం లోపు ఉన్నవి 162, బేస్‌మెంట్ లెవెల్ పూర్తయినవి 465, లెంటెల్ లెవెల్ 1, రూఫ్ లెవెల్ 1, రూఫ్ కాస్ట్ 1 ఉన్నాయని, డిసెంబర్‌లోపు వీటన్నింటినీ పూర్తి చేయాలని థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. ఉపాధి, డ్వాక్రా గ్రూపుల నిధులను కాంట్రాక్టర్‌లకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హౌసింగ్ డీఈ రవికుమార్, ఏఈ రవి, ఏపీఓ చంద్రశేఖర్, డ్వాక్రా ఏపీఎం జనార్ధన్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



కుంటనహాల్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కౌతాళం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను గడువులోపు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ లాలిక్ష్మయ్య, ఎంపీడీఓ సుబ్బారాజు సూచించారు. బుధవారం మండలంలోని కుంటనహాల్ గ్రామ జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి ఇవ్వాలని చెప్పారు. అనంతరం చెత్తసేకరణ స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ సుబ్బారాజు సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరును పట్టిక ఆధారంగా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న సచివాలయ భవన పనులను పరిశీలించారు. వీరి వెంట ఏపీఓ జుబేర్‌అహ్మద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నూర్‌బాషా, గ్రామ ఇన్‌చార్జ్ శివరాం పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

హొళగుంద: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఆనంద్ లోకదశ్ సూచించారు. బుధవారం ఆయన సుళువాయి, కోగిలతోట, మార్లమడికి ఆర్బీకేల పరిధిలో ఇప్పటివరకు వీఏఏలు ఈ-క్రప్ నమోదు చేసిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పంటల బీమా, పంట నష్ట పరిహారానికి ఈ-క్రాప్ బుకింగ్ ఎంతో కీలకమన్నారు. ఇంకా ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకోని రైతులు వీఏఏలను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

కృష్ణగిరి: ఖరీఫ్‌లో సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి పథకాలు అందుతాయని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ నెల 25లోగా అందరూ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.

26 నుంచి రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలు

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మానవత్వమును పెంపొందించు విద్యావశ్యకత' అనే అంశంపై డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు, 'ప్రకృతియే ఉత్తమ గురువు' అంశంపై ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు, 'ఆచార్య దేవో భవ' అంశంపై 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శైలజ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిని బుధవారం సాయంత్రం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విజిలెన్స్ అధికారి డాక్టర్ శైలజ ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం ప్రభుత్వాసుప్రతిలో రోగుల వార్డులు, గదులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించటంతో పాటు, సమయ పాలన పాటించాలన్నారు. ఆసుపత్రిలో డెలివరీలు, కుటుంబ నియంత్ర ఆపరేషన్లు, కంటి ఆపరేషన్లు, రోజు ఓపీ బాగానే ఉందని చెప్పారు. వంద పడకల ఆసుపత్రి పూర్తయ్యేవరకు ఉన్న సౌకర్యాలతో రోగులకు సేవలు అందించాలన్నారు. అవసరమైన సౌకర్యాలను పైస్థాయి అధికారులకు తెలియజేస్తానన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సురేష్ కంటి పరీక్షలు నిర్వహించారు. బుధవారం పాఠశాలలోని విద్యార్థుల కంటి పరీక్షలను నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, అవసరమైన వారికి అద్దాలు అందజేస్తామని చెప్పారు.

పురాతన ఆలయాలను డీడీఎన్ పథకంలో చేర్చాలి

ఆదోనిఅర్బన్ : పట్టణ ప్రాంతాల్లోని పురాతన దేవాలయాలను డీడీఎన్ స్కీమ్‌లో చేర్చాలని, అలాగే వేదపండితుల ఖాళీలను భర్తీ చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, ఆపన్నప్రదీపన బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల మధుసూదనశర్మ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు కూడా ధూపదీప నైవేద్య స్కీంను వర్తింపజేసి నిరుపేద అర్చకులను ఆదుకోవాలన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.5వేల నుంచి రూ.10 వేలు పెంచారని గుర్తు చేశారు. అయితే కులాల ప్రాతిపదికన నూతన దేవస్థానాలు పెరిగిపోతున్నందువల్ల పురాతన దేవస్థానాలకు భక్తులు రావడం తగ్గి అర్చకులకు జీవనాధారం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నివాళి

మంత్రాలయం : మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వీఆర్ఏ నరసన్న మాధవరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గ్రామానికి చేరుకుని నరసన్న మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, సర్పంచ్ ముక్కరన్న ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

హాలహర్వి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ ఈరన్న సూచించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి సెలక్షన్ కొరకు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలబాలికలకు ఆటల పోటీలను బుధవారం మండల ఉన్నత పాఠశాల పీడీల ఆధ్వర్యంలో చేపట్టగా ఎంఈఓ ఈరన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుతో పాటు ఆటలను కూడా ఆడాలని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ

హొళగుంద: ఇంగళదహాళ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12న జరిగిన ఎస్‌జీఎఫ్ గేమ్స్, అథ్లెటిక్స్ పోటీల్లో హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 9, 10వ తరగతి చదువుతున్న ఉరుకుంద, రుద్రమ్మ, శరణబసవ, నాగరాజు, నందిని, విద్యశ్రీ, యశోధ, విష్ణువర్ధన్, రుద్రేష్ తదితరులు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, పీడీని అభినందించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

నందవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయాలని ఏపీడీ అలీపిర ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దశరథ రామయ్య ఆధ్వర్యంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .మండలంలో 456 మంది కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం పెండింగ్‌లో ఉందని వివరించారు. ఆధార్ అనుసంధానం డిసెంబర్ 31వ వరకు పొడిగించారన్నారు. అలాగే జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి కూలీలకు 90 రోజుల పని దినాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు.

కౌలుట్ల చెన్నకేశవ స్వామి సన్నిధిలో ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్ హనుమంతరెడ్డి

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలసిన భూదేవి సమేత శ్రీలక్ష్మి కౌలుట్ల చెన్నకేశవ స్వామి వారిని బుధవారం ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి వారికి శాలువాలు, పూలమాలలు వేసి ఆలయంలోకి స్వాగతించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఎమ్మెల్యేలు హామీఇచ్చారు. ఎమ్మెల్యే సాయి కుమారుడు వై.జయమనోజ్ రెడ్డి, మంత్రాలయం ఎంపీపీ వై.గిరిజమ్మ, ఎర్రిస్వామి, ఆలయ ఉద్యోగి సురేష్ ఉన్నారు.

ఈ నెల 30నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు



మాట్లాడుతున్న వైద్యాధికారిణి ఆశాజ్యోతి

పెద్దకడుబూరు: ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి ఆశాజ్యోతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 15వ తేదీ నుంచి ఆశాలు, ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అందరి ఆరోగ్య పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకొని వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఆరోగ్య సమస్యలున్న వారిని ఏర్పాటు చేసే వైద్య శిబిరానికి తీసుకు రావాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ నాసరపరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాపై అభ్యంతరాలను చూయించేందుకు 18వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు ఓటరు జాబితా పరిశీలనకు వచ్చే బీఎల్వోలకు సహకరించాలని కోరారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరికీ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్‌శర్మ, నిత్యానంద్, ఎన్నికల డీటీ గురురాజావు, బీఎల్వోలు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈఓ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రంగారెడ్డి

పత్తికొండ రూరల్: పత్తికొండలో డిప్యుటీ డీఈఓ కార్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి బుధవారం ప్రారంభించారు. ప్రస్తుతానికి మండల విద్యాశాఖ కార్యాలయంలోనే డిప్యుటీ డీఈఓ కార్యాలయం కొనసాగుతుందన్నారు. ఇన్‌చార్జ్‌గా డీఈఓ వ్యవహరించనున్నారు. ముందుగా దూదేకొండ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు నివేదిక పంపించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. పత్తికొండలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓలు రమేష్, రంగస్వామి ఉన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నపిల్లలకు సమయానుసారం టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ సూచించారు. స్థానిక ఇల్లూరు నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని మార్కెట్‌యార్డు సచివాలయంలో జరుగుతున్న ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యకర్తల రికార్డ్స్, అంగన్‌వాడీ కార్యకర్తల రికార్డులు, ఎంసీపీ కార్డులను పరిశీలించి గర్భిణులకు ఐరన్‌మాత్రలను, బరువు తక్కువ, ఎత్తు తక్కువ పిల్లలకు విటమిన్-ఎ సిరప్, ఐరన్ సిరప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా కారణం చేత టీకాలు ఇవ్వకపోతే వారి జాబితాను తయారు చేసుకోవాలన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహించే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో పిల్లలు, గర్భిణులకు వ్యాక్సిన్ పూర్తి చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడవ విడతగా నిర్వహిస్తామన్నారు.

ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపు

కర్నూలు కల్చరల్: ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపు రావడం సంతోషమని యూనియన్ రీజినల్ కార్యదర్శి ఏవీ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్టీసీ కర్నూలు-2 డిపో వద్ద బాణా సంచా కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వంలో కలిసిన తరువాత ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌ను అతి పెద్ద సంఘంగా గుర్తించి జీఓ నెం. 97ను జారీ చేశారన్నారు. రాష్ట్ర నాయకత్వం కృషితో ఇది సాధ్యమైందన్నారు. ప్రభుత్వ గుర్తింపుతో మాపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కర్నూలు -1, 2 డిపో యూనియన్ కార్యదర్శులు ఆర్‌వీఎం రావు, జి.మహేశ్వర్‌రావులు మాట్లాడుతూ యూనియన్‌కు గుర్తింపు రావడానికి సహకరించిన ప్రభుత్వ పెద్దలు, ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ, సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామోదర్, జి.వి. నరసయ్యకు కృతజ్ఞతలు అన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి ముత్యాలరెడ్డి, నాయకులు రబ్బాని, చంద్ర, ఆనంద్, సుజయరాజు, ప్రసాద్, వీరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.